# ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



రాంపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



వేలాడున్న తీగలకు అమర్చిన కొయ్య

దస్తురాబాద్,మే 7 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న కాలనీ వాసులకు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభం పూర్తిగా వంగి ఉండడంతో ఇండ్ల మధ్యలో నుంచి తీగలు కిందికి వేలాడుతుండడంతో కాలనీ వాసులు భయాదోంళనకు గురవుతున్నారు. ఏలాంటి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యం

ఎదులాపురం, మే 7 : ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రపంచ దేశాలు భారత దేశానికి మద్దతు పలుకుతున్నాయని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ అన్నారు. ఉగ్రస్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట దాడిని హర్షిస్తూ బుధవారం ఆదిలాబాద్‌లోని వినాయకచౌక్ వద్ద సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాలుస్తూ పెద్ద ఎత్తున భారత్ మాత కీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గోపాల కృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతీ, సమితి సభ్యులు కందుల రవీందర్ , రేణుకుంట్ల రవీందర్ , వేణు , సత్యం , నర్సింహులు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, అశోక్ రెడ్డి , దేవన్న, ఎల్వీ రావు , శ్రీహరి, రాజు, మనోహర్ పాల్గొన్నారు

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

లక్ష్మణచాంద, మే 7: రైతులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జీ రాధిక అన్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామ రైతు వేదికలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, ఎస్ఐ సుప్రియ, న్యాయవాదులు , నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా వాహనాల తూకం చేసే కాంటా

# నిరుపయోగంగా వాహనాల తూకం


ఇంద్రవెల్లి, మే 7:ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వాహనాలను తూకం చేసే కాంటా నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కొనుగోలు చేసిన వివిధ రకాల ధాన్యాలు లారీలో లోడింగ్ చేసి, వాహనాలు కాంటాపై తూకం వేయాలి. కాని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తూకం కాంటా మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారిందని వాహనదారులు తెలిపారు. దీంతో తమ వాహనాలను బయటకు తీసుకెళ్లి తూకం వేసుకొని ప్రభుత్వ గోదాములకు ధాన్యాలు తరలిస్తున్నట్లు వాహనదారులు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులోని లారీ తూకం కాంటాకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

# మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల ఏర్పాటు

నిర్మల్ చైన్‌గేట్, మే7: కేంద్ర ప్రభుత్వ పథకం కింద నిర్మల్ జిల్లాలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా పరిశ్రమ కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ల పోస్టులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు మేనేజర్ ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఇటి పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మే 10 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు www.nimsme.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఇతర వివరాలకు జిల్లా పరిశ్రమల కేంద్రం రూమ్ నంబర్ ఎఫ్-5 ఐడీఓసీలో సంప్రదించాలని సూచించారు.

# కళలు, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



గుడిహత్నూర్: శిక్షణ పత్రాలు అందుకున్న యువతీ యువకులతో కలెక్టర్, ఎస్పీ

గుడిహత్నూర్, మే 7 : ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు, కళలు చాలా గొప్పవని వాటిని కాపాడుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం శంభుగూడ గ్రామంలో బుధవారం గుస్సాడీ కార్యశాల ముగింపు ఉత్సవ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యసనాల బారిన పడకుండా చదువుతో పాటు కళలపై శ్రద్ధ చూపాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు శిక్షణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సకల కళ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ కాత్లె శ్రీధర్, ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అబ్దుల్ హై, మాజీ సర్పంచ్ కుమ్ర శంభు, గ్రామ పటేల్ నాగరావ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ఇచ్చోడ, మే 7: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్న లబ్ధిదారుల చెక్ లిస్ట్‌ను బుధవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. అలాగే ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలను సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రాథమిక జాబితాలో ఉన్న పేర్లను మరోసారి వెరిఫికేషన్ చేయాలని, అన్ని కోణాల్లో పరిశీలించి లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలన్నారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో జితేందర్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

జైనథ్, మే 7 : భోరజ్ మండలంలోని బాలాపూర్ నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఆయన వెంట జేసీ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, గ్రామస్తులు ఉన్నారు.

## న్యూస్ పేపర్ కాదు.. పెండ్లి పత్రికే..

బోథ్, మే 7: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు తన పెండ్లి పత్రికను వినూత్నంగా ముద్రించాడు. న్యూస్ పేపర్ మాదిరిగా వెడ్డింగ్ న్యూస్ అని ప్రింట్ చేయించాడు. నాలుగు పేజీల్లో వధూవరుడి కుటుంబీకులు, కుటుంబ నేపథ్యం, కల్యాణ వేదిక వివరాలను ముద్రించేలా పత్రిక తయారు చేయించాడు. వినూత్న రీతిలో ముద్రించిన పత్రికను ఆహ్వానితులు ఆసక్తిగా చూస్తున్నారు.




బోథ్‌కు చెందిన ఓ యువకుడి పెండ్లి పత్రికను న్యూ పేపర్‌లా ముద్రించిన దృశ్యం

## విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

నేరడిగొండ, మే 7 : వానకాలం పంటలో రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. . ఎంఏవో కృష్ణవేణి, కుమారి పీఏసీఎస్ చైర్మన్ రమేశ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతం

భైంసా, మే 7 : పహాల్గాం ఉగ్రవాద చర్యలకు ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో ఆత్మశాంతి చేకురుతుందన్నారు.

## ముగిసిన విద్యుత్ వారోత్సవాలు

ఎదులాపురం, మే 7 : ఎలక్ట్రిసిటీ వల్ల ఎవరూ నష్టపోవద్దనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ జేఆర్ చౌహాన్ అన్నారు. మే 1 నుంచి చేపట్టిన విద్యుత్ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆదిలాబాద్‌లోని ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలు, టోల్ ఫ్రీ నంబర్లు, సేవలతో కూడిన పోస్టర్ విడుదల చేశారు. ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈలు ఐదన్న, సుభాష్, గోపీ, ఏవో శ్రీనివాస్, ఏడీ లక్ష్మణ్, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

## 203 దుకాణాల్లో 7,03,653 పత్తి విత్తనాల సంచులు

ఎదులాపురం, మే 7: ఆదిలాబాద్ జిల్లాలో 203 విత్తన దుకాణాల్లో 7,03,653 పత్తి విత్తన సంచులు వివిధ కంపెనీలకు చెందిన హైబ్రిడ్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి జీ శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సమీప డీలర్ వద్ద విధిగా రసీదు పొంది విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు.

## 20న సమ్మెను జయప్రదం చేయండి

ఎదులాపురం, మే 7 : ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీపీజేఏస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, టీపీవీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనిష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

## సాగుపై అవహగాహన సదస్సు

గుడిహత్నూర్, మే 7 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పంటల దిగుబడి, సాగు విధానం, తక్కువ మోతాదులో ఎరువుల వాడకంపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బమీ రాజేశ్వరి,ప్రొఫెసర్ డాక్టర్ ఎం సురేశ్, మండల వ్యవసాయాధికారి భగత్ రమేశ్, పశువైద్యాధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు చేసుకోవాలి

సోన్, మే 7: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని సిద్దులకుంట గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. భుసార పరీక్షలు కల్తీ సేంద్రియ ఎరువుల కట్టడి, పలు విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఏవో వినోద్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలుగకుండా కాంటాల సంఖ్య పెంచాలి

బోథ్, మే 7 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఇబ్బంది కలుగకుండా హమాలీలు, కాంటాల సంఖ్య పెంచాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం బోథ్ మార్కెట్ యార్డును సందర్శించి ఆయన మాట్లాడారు. దూర గ్రామాల నుంచి రైతులు తీసుకువచ్చిన జొన్న పంటకు ప్రస్తుతం అకాల వర్షాలు పడే అవకాశాలు ఉండడం ద్వారా రైతులకి గన్నీ సంచులు ఇచ్చి, తూకం ద్వారా కొనుగోలు చేపట్టే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, రమేశ్, గంగయ్య, స్వామి, గంగాధర్, బొడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్, మే 7 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి గంగయ్య తండ్రి ఇటీవల మృతి చెందాడు, బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. అలాగే బోథ్‌కు చెందిన బోనగిరి రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో చికిత్స పొందుతుండగా అతడిని పరామర్శించారు. మాజీ ఎంపీపీ వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్, బొడ్డు శ్రీనివాస్, ప్రశాంత్, కుమ్మరి రమణ, గంగమల్లు ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

భైంసా, మే 7 : నిర్మల్ జిల్లా భైంసాలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మాజీ కౌన్సిలర్ కపిల్ షిండే, బీజేపీ నాయకులు, పారిశుధ్య కార్మికులు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైబజార్ వ్యవధి కాలం ముగిసిన కూడా 10 శాతంతో ఇంకా డబ్బులు వసూలు చేస్తున్నారని వెంటనే టెండర్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. అంతేగాకుండా ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు రెండు స్థలాల్లో ఏర్పాటు చేసి బిల్లులను కాజేశారన్నారు. పారిశుధ్యానికి సంబంధించిన ట్రాక్టర్ మరమ్మతు, టైర్ల బిల్లులను సైతం తీసుకొని ప్రభుత్వానికి గండి కొడుతున్నారని అన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు తమ వేతనాలు పెంచి బ్యాంకు ఖాతాలో జీతాలు వేయాలని వినతిపత్రంలో కోరారు. ఇక్కడ మల్లేశ్, కపిల్, రావుల రాము, కపిల్ షిండే. పోశెట్టి, రాజన్న, దిలీప్, ప్రవీణ్, వెంకటేశ్, రాజు ఉన్నారు.

## దివ్యాంగులకు సదరమ్ పరీక్షలు

నిర్మల్ చైన్‌గేట్, మే 7 : నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో దివ్యాంగులకు సదరమ్ ధ్రువీకరణ పత్రాల కోసం బుధవారం పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యురాలు రోషిని దివ్యాంగులకు పరీక్షలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 30 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరమ్ శిబిరానికి వచ్చే దివ్యాంగులు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో రావాలని కోరారు. కార్యక్రమంలో రేడియాలజిస్ట్ సతీశ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి

ఎదులాపురం, మే 7 : ఆదిలాబాద్ జిల్లా భౌగోళికంగా విశాలంగా ఉండడంతో మరో బెటాలియన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం అనుమతించిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని నిజామాబాద్ గ్రూప్ కమాండర్ సునీల్ అబ్రహం అన్నారు. బుధవారం పట్టణంలోని 32 ఎన్సీసీ బెటాలియన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ అబ్రహం మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ లేదా మంచిర్యాల ప్రాంతంలో 38 బెటాలియన్ పేరిట ఏర్పాటు చేస్తామని తెలిపారు. రిపబ్లిక్ డే పరేడ్ కేడెట్ల ఎంపికలో భాగంగా బెటాలియన్‌ను తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీవో వికాస్ శర్మ, అధికారులు గాలి అశోక్ పాల్గొన్నారు.

## ఇత్తడి పరికరాలను సుందరంగా తీర్చిదిద్దాలి

ఉట్నూర్, మే 7 : ఆదివాసులు తయారు చేస్తున్న ఇత్తడి పరికరాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో ఇత్తడి వస్తువుల కళాకారులకు రంగులు, బ్రెష్‌ల కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ఇత్తడి కళాకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్‌వో సంస్థతో ఒప్పందం చేసుకున్నామన్నారు. కళాఖండాలను తుది మెరుగులు దిద్దేందుకు అవసరమైన టూల్ కిట్లను కావాలని అడగడంతో కిట్స్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లోని వంటశాల తనిఖీ

ఎదులాపురం, మే 7: ఆదిలాబాద్ రిమ్స్‌లో రోగులకు అందిస్తున్న వంటలను బుధవారం డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు సక్రమంగా భోజనం అందులో ఉందా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పెట్టాల్సిన వంటలను పరిశీలించారు. మెనూ మార్పు కోసం రోగుల నుంచి అభిప్రాయాలు సేకరించామని తెలిపారు. అనంతరం వంటశాల గదిని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట రిమ్స్ ఆర్ఎంవో డాక్టర్ సాయిప్రసన్న రెడ్డి ఉన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

కుంటాల, మే 7 : భూ భారతి పైలట్ మండలం కుంటాలలో బుధవారం వెంకూర్, రాజాపూర్, కుంటాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కుంటాల రెవెన్యూ సదస్సును నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. భూ సమస్యల పరిష్కారానికి ఇది చక్కటి అవకాశమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, ప్రత్యేకాధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. మూడు గ్రామాల్లో మొత్తం 67 అర్జీలు స్వీకరించినట్లు కుంటాల తహసీల్దార్ కమల్ సింగ్ తెలిపారు.

## న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 7: నిర్మల్ జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల వారిగా నిరక్షరాస్యుల వివరాలు సేకరించి వారందరికి కనీస విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాసర మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, డీఆర్డీవో విజయలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి తిరుపతిరావు, మెప్మా పీడీ సుభాష్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, లింబాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఇద్దరు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

ఎదులాపురం, మే 7 : స్నేహితుడి ద్విచక్రవాహనం కోసం హత్య చేసిన ఇద్దరు స్నేహితులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు చేరో రూ.4వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు తీర్పును వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. కేసు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని బంగారిగూడకు చెందిన షేక్ అస్లాం, కోకాటి విజయ్ కలిసి తమ స్నేహితుడైన పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఇందూర్ గజానంద్‌ను నమ్మించి తన వద్ద ఉన్న ద్విచక్రవాహనం దొంగలించాలి అనుకున్నారు. ఆదిలాబాద్ నుంచి పథకం ప్రకారం జైనథ్ వైపు చాందా మీదుగా 04 జనవరి 2022న తీసుకొని వెళ్లారు. డబ్బులు కావాలని ఉద్దేశంతో ఇందూర్ గజానంద్‌ను వైఆర్‌కే కన్‌స్ట్రక్షన్ సమీపంలో కత్తితో గొంతు కోసి హత్య చేశారు. అ తర్వాత మృతుడి ద్విచక్రవాహన్ని తీసుకొని పారిపోయారు. స్థానిక సర్పంచ్ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కే జగదీశ్‌గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ బీ పెర్సెస్, సీఐలు కే మల్లేశ్, కే నరేశ్‌కుమార్ నిందితులను విచారించి కోర్టులో చార్జిషీటు దాఖాలు చేశారు. జిల్లా కోర్టులో కోర్టు డ్యూటీ అధికారి జమీర్ 25 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రభుత్వ న్యాయవాది పీపీలు మేకల మధుకర్, రహీంలు సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు ఇద్దరు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.4వేలజరిమానా విధించారు. నేరం రుజువు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

# ఆర్జీయూకేటీ నూతన విద్యా సంవత్సరంపై సమీక్ష

బాసర, మే 7 : ఆర్జీయూకేటీలో నూతన విద్యాసంవత్సరం 2025-26 అకాడమిక్‌లో భాగంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధ్యక్షతన అధ్యాపకులు, అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వాహణ, ప్రతి విభాగం చేపట్టబోయే కార్యాచరణపై చర్చించారు. ఇప్పటికే పూర్తయిన పరీక్షల ఫలితాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి పీయూసీ విద్యార్థులకు వార్షిక విధానాన్ని రద్దు చేసి, సెమిస్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది నిరంతరం మూల్యాంకనాన్ని మెరుగు పర్చేందుకు అనుకూలమవుతుందని వివరించారు. అదేవిధంగా జూన్ మొదటి లేదా రెండో వారంలో నిర్వహించనున్న బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో సిలబస్ నవీకరణ, కొత్త కోర్సులపై చర్చించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రణధీర్, అసోసియేట్ డీన్లు చంద్రశేఖర్, మహేశ్, విఠల్, నాగరాజు, సీవోఈ వినోద్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, మే 7: ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు కొనసాగుతుందని, పలు మండలాల్లో ఆక్రమణకు గురైన కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. నిర్మల్ గ్రామీణ మండలంలో 35.03 ఎకరాలు రూ.5.77 కోట్లు, భైంసా మండలంలో 18.31 ఎకరాలు రూ.2.07 కోట్లు, నర్సాపూర్(జీ) మండలంలో 16 ఎకరాలు రూ.2.04 కోట్లు, లోకేశ్వరం మండలంలో 12.25 ఎకరాలు రూ.1.34 కోట్లు మొత్తం 82 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. పలు మండలాలలో 260 ఎకరాలలో గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రెవెన్యూ, అటవీ భూములు, చెరువు శిఖం భూములు, సాగునీటి ప్రాజెక్టుల కాలువలు, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుభీర్, మే 7: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామంలో మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మరో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారంమండల వ్యవసాయశాఖ అధికారి సారికరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కచ్చకాయల శంకర్, వితాపూర్ మహిపాల్ రెడ్డి, ఏఈవో మహేశ్, సాయారెడ్డి, రమేశ్, బాధ్యులు మురళీ, ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

## రోడ్లపై కత్తులతో ప్రదర్శనలు, బర్తడేలు చేస్తే కఠిన చర్యలు

ఎదులాపురం, మే 7: రోడ్లపై కత్తులతో ప్రదర్శనలు, బర్తడేలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ రావ్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని తాటిగూడకు చెందిన రాహుల్ జందాడే, క్రాంతి నగర్‌కు చెందిన సయ్యద్ రిజ్వాన్, మహాలక్ష్మివాడకు చెందిన తైవార్ ఖాన్ సోషల్ మీడియాలో కత్తులను పట్టుకొని ప్రజలను భయభ్రాంతులను గురి చేసేలా వీడియోలు పోస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఒకరిపై కేసు

ఎదులాపురం, మే 7: తెల్లకల్లులో బెంజోడియాజిఫైన్స్ మందు కలిపి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని తిరుపెల్లి వద్ద సిద్ధవేణి స్వామి గౌడ్ నివాసంలో తెల్లకల్లు బాటిల్లో అధిక డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో బెంజోడియాజిఫైన్స్ మందు కలిపి అమ్ముతునట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి..

నార్నూర్, మే 7 : నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నార్నూర్ పంచాయతీలో కాంగ్రెస్ నాయకులు గ్రామసభ నిర్వహించకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీం పాషా, పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపా రు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు బిక్కు, మాజీ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

## ప్యాక్స్ సీఈవో సస్పెన్షన్

కుంటాల, మే, 7 : కుంటాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మురళీకృష్ణ ని కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అలాగే కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి బోజేందర్ నుంచి వివరణ కోరనున్నట్లు జిల్లా సహకార అధికారి బుధవారం తెలిపారు. అందకూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేయగా అక్కడ కనీస వసతులు కల్పించకపోవడం, కొనుగోళ్లపై నిర్లక్ష్యంగా వ్యవహారించడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు డీసీవో తెలిపారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నర్సాపూర్ (జీ), మే 7 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని సూర్యంతండా గ్రామంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన చౌహాన్ సాయినాథ్ (28) గత ఏడాది బొలెరో వాహనాన్ని ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. ఈ నెల 4వ తేదీన ఫైనాన్స్ డబ్బులు ఎలా తీర్చాలో అంటూ మనోవేదనకు గురై మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయినాథ్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఏజెన్సీ రోగులకు త్వరగా వైద్యం అందించాలి

ఉట్నూర్, మే 7: ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చే రోగులకు త్వరగా వైద్యం అందించాలని ఉట్నూర్ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. ఏజెన్సీలో చాలా సమస్యలపై రిమ్స్‌కు రెఫర్‌పై వస్తున్నారని వారికి త్వరగా, నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఇక్కడ రిటైర్డ్ అడిషనల్ డీహెచ్ఎంవో వసంత్‌రావ్, నాయకుడు బాపురావ్ ఉన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

జైనథ్, మే 7: భోరజ్ పరిధిలోని గిమ్మా ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి గిమ్మా గ్రామానికి వెళ్తున్న ఆటోను గుర్తు తెలియని లారీ ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గిమ్మా గ్రామానికి చెందిన గోంటి ముక్కుల నారాయణ (65) కాళ్లు చేతులు విరిగిపోయి ప్రాణపాయస్థితిలో ఉన్నారు. గోంటి ముక్కుల గంగన్న (28) మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

బోథ్, మే 7: బోథ్-నిర్మల్ రహదారిపై పొచ్చెర క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సర్దార్ ప్రతి రోజూ నిర్మల్ నుంచి ద్విచక్రవాహనంపై వచ్చి కుర్చీలు విక్రయిస్తాడు. బోథ్ నుంచి నిర్మల్ వైపునకు వెళ్తుండగా ముళ్ల చెట్ల కొమ్మలు ద్విచక్రవాహనానికి తగలడంతో అదుపు తప్పి కిందికి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అనంతరం బోథ్ సీహెచ్‌సీకి తరలించారు. పెట్రోలింగ్ పార్టీ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

## దేశీదారు పట్టివేత

భీంపూర్, మే 7: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం మందపల్లికి చెందిన మెస్రం కొండు ద్విచక్రవాహనంపై మహారాష్ట్ర మాండ్వి వైపు నుంచి దేశీదారు తీసుకువస్తుండగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ విజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు అర్లి(టీ) శివారు మందపల్లి వద్ద మాటువేసి పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి రూ. 10 వేల విలువ గల దేశీదారు సీసాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వారిలో సిబ్బంది తానాజీ, నానంగ్ సింగ్, వెంకటగిరి, శ్రీధర్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

భైంసా, మే 7 : సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. అంతేగాకుండా షీ టీం సిబ్బందితో కొన్ని కుటుంబ కలహాల కేసులో ఇరు పార్టీ వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐలు గోపీనాథ్, మల్లేశ్, ఎస్ఐలు శంకర్, గణేశ్, షీటీం ఇన్‌చార్జి మహిళా ఎస్ఐ పెర్సిస్, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

## తులం బంగారం ఎక్కడా?

కుభీర్/భైంసాటౌన్, మే 7: ఎన్నికల్లో సీఎం రేవంతర్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 1లక్ష నగదుతో పాటు ఇస్తానన్న తులం బంగారం ఎక్కడా అని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రశ్నించారు. నిర్మల్ జిల్లా కుభీర్‌లోని రైతువేదికలో 30 మందికి, భైంసాలోని ఐకేపీ కార్యాలయంలో 116 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే కుభీర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్డీఎఫ్ నిధులు రూ.50లక్షలతో చేపట్టిన నూతన తహసీల్ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## చింతమడుగే మాకు ఆధారం

దస్తురాబాద్, మే 7 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం భూత్కూర్ గ్రామ పంచాయతీలోని రాంపూర్ గ్రామ శివారులోని గోదావరిలో ఉన్న చింతమడుగే మాకు ఆధారమని రాంపూర్ గ్రామ మత్స్యకారులు అన్నారు. బుధవారం రాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మత్స్యకారులు మాట్లాడారు. గోదావరి నదిలోని చింతమడుగుపై చేపల వేటపై ఆధారపడి 90 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. మా పక్క గ్రామమైన దస్తురాబాద్ మత్స్యకారులు మేము చేపలు పట్టే చింతమడుగులో మేము కూడా చేపలు పడుతామని, మాకు లైసెన్స్‌లు ఇవ్వకుండా చేసి మా సొసైటీ రద్దు చేస్తామని మమ్మల్ని బెదిరిస్తూ మా చేపల వేటలను నిలిపి వేశారని అన్నారు. అధికారులు స్పందించి చింతమడుగులో మాకు అనుమతి ఇవ్వాలని కోరారు.